సాక్షి జనగామ

సోమవారం | 21 | ఆగస్టు | 2023



'ఎద'కు ఇదే సమయం..

ఆగస్టు, సెప్టెంబర్ నెలలు పశువు ఎదకు వచ్చే అనుకూల సమయమని, ఈ నెలల్లో కృత్రిమ గర్భధారణ చేయించాలని పశువైద్యాధికారి మంజీలాల్ తెలిపారు. - 8లో▸



కనిపెట్టకుంటే కష్టమే!

మనుషులు, పశువుల ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం చూపే వయ్యారిభామ కలుపుమొక్కను కనిపెట్టకుంటే కష్టమేనని కేవీకే శాస్త్రవేత్త తెలిపారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
31^0 / 26^0

వాతావరణం

జిల్లాలో వాతావరణం పొడిగా ఉంటుంది. పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. సాయంత్రం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

విద్యార్థుల పక్షపాతి 'ఎర్రబెల్లి'

- బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్



పాలకుర్తి/పాలకుర్తి టౌన్: విద్యార్థులకు అవసరమైన డిగ్రీ కళాశాల మంజూరు మంత్రి దయాకర్ రావు చొరవేనని బీఆర్ఎస్‌వి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మేడారపు భాస్కర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకుర్తిలో మహాత్మా బాపులే తెలంగాణ బ్యాక్ వర్డ్ క్లాసెస్ రెసిడెన్సియల్ డిగ్రీ కళాశాల మంజూరులో మంత్రి దయాకర్‌రావు పాత్ర ఉందన్నారు. విద్యకు దూరంగా ఉన్న పలువురికి ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇతర తరగతులు నిర్వహించి ఉద్యోగాలు కల్పించడం జరిగిందన్నారు. భారత రాష్ట్ర సమితి విద్యాథ్యార్థి విభాగ పాలకుర్తి కోఆర్డినేటర్ పోశాల పవన్ మాట్లాడుతూ పెద్ద చదువులు దూరమైన గ్రామాల్లో ఉన్నత విద్యను ప్రసాదించడం మంత్రి ఘనత అన్నారు. నాయకులు జోగు కృష్ణ, వంగల అశోక్, మహ్మద్ అబ్బాస్, కొడం సాయిరాం, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల అందజేత



జనగామ రూరల్: దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని గుండ్లగడ్డలో కిషోర బాలికలకు బ్యూటీషియన్‌లో ఉచిత శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా మేనేజర్ విజయశ్రీ మాట్లాడుతూ ప్రస్తుతం బ్యూటీషియన్‌కు మంచి డిమాండ్ ఉందని, శిక్షణ తర్వాత ఉపాధి అవకాశం తప్పనిసరిగా లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో 26 మంది యువత పాల్గొని శిక్షణ తీసుకున్నారని, వారికి సర్టిఫికెట్‌లు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుందరయ్య, టీవీ రెడ్డి, ట్రైనర్ నూరుజహాన్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న దీవెనలు నాకే: ఎమ్మెల్యే రాజయ్య



చిల్పూరు: సీఎం కేసీఆర్ ఆశీస్సులు, వేములవాడ రాజన్న దీవెనలు తనకే ఉంటాయని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. ఆదివారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్న అనంతరం ఆయనకు అర్చకులు ఆశీర్వచనాలు, శేషవస్త్రాలతో సన్మానించి ప్రసాదం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తుందన్నారు.


ఈఎంటీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ: జిల్లాలో 108 వాహనాల (అంబులెన్స్)పై అత్యవసర సేవలకు ఈఎంటీ (ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్) పోస్టులకు ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 108 జిల్లా మేనేజర్ మండ శీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈఎంటీ ఉద్యోగం కోసం సైన్స్ గ్రూపులో డిగ్రీ(డిప్లొమా ఇన్ ఈఎంటీ, బీఎస్సీ (బైపీసీ)), కాగా పదో తరగతి పూర్తి చేసి ఏఎన్ఎం కోర్సు, ల్యాబ్ టెక్నీషియన్ అనుభవం కలిగిన 30 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. ఇందులో ఎంపికైన వారికి 45 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ నెల 23 వరకు జిల్లా ఆస్పత్రిలోని 108 కార్యాలయంలో ఉదయం 10 గంటల వరకు సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 8985635108, 8008935522 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఐటీఐలో..

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రంలో మూడో విడత ఐటీఐ అడ్మిషన్లకు రాష్ట్ర ఉపాధి, శిక్షణ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసిందని రాష్ట్ర ప్రైవేట్ ఐటీఐల యాజమాన్య సంఘం కార్యనిర్వాహణ అధ్యక్షుడు, శ్రీసాయి ఆదిత్య ఐటీఐ కరస్పాండెంట్ పిల్లలమర్రి వెంకటేశం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడో విడత అడ్మిషన్లకు ఈనెల 30న చివరి తేదీగా నిర్ణయించారని, అడ్మిషన్ పొందగోరు విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2022–23లో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు శివునిపల్లిలోని శ్రీసాయి ఆదిత్యలో ఎలక్ట్రీషియన్ కోర్సులో ఉచిత అడ్మిషన్లకు ఈనెల 28లోగా సంప్రదించాలన్నారు. పూర్తి వివరాలకు 9849737154 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

టికెట్ల లొల్లి..!



ఎవరు వద్దు.. ఎవరు ముద్దు..

- బీఆర్ఎస్ అభ్యర్థుల ఖరారుపై భిన్నస్వరాలు
- అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటాపోటీ నిరసనలు
- 'సిట్టింగ్'లు వర్సెస్ ఎమ్మెల్సీల అనుచరుల ప్రదర్శనలు
- తారాస్థాయికి జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ వివాదం
- భూపాలపల్లికి తాకిన సెగ.. టవరెక్కిన ఎమ్మెల్సీ చారి వర్గీయులు
- నేడు తొలి జాబితా? ఉమ్మడి జిల్లా నేతల్లో ఉత్కంఠ..

సాక్షిప్రతినిధి, వరంగల్ : అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల ఎంపికపై భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి. ఎన్నికలు సమీపించడం.. నేడో, రేపో అభ్యర్థుల తొలి జాబితా విడుదలవుతుందన్న ప్రచారంతో టికెట్ల పోరు రాజుకుంటోంది. చాలా నియోజకవర్గాల్లో 'సిట్టింగ్'ల స్థానంలో ఎమ్మెల్సీల పేర్లు వినిపిస్తుండడంతో ఎమ్మెల్యేల అనుచరులు నిరసన ప్రదర్శనలకు దిగుతున్నారు. ఒక దశలో పోటాపోటీగా దిష్టిబొమ్మలను దహనం చేసే పరిస్థితి ఏర్పడింది. నిన్న, మొన్నటి వరకు జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాలకే పరిమితమైన నిరసనల పర్వం ఆదివారం భూపాలపల్లికి పాకింది. భూపాలపల్లి టికెట్ సిట్టింగ్ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి కాకుండా ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారికి ఇవ్వాలని చారి వర్గీయులు టవరెక్కారు. ఇదే సమయంలో పలుచోట్ల 'ఎమ్మెల్సీలు వద్దు, 'సిట్టింగ్'లే ముద్దు అని కొందరు.. సిట్టింగ్‌లు వద్దు.. ఎమ్మెల్సీలే ముద్దు అని మరి కొందరి పోటాపోటీ ఆందోళనలు అధిష్టానానికి తలనొప్పిగా మారాయి.

రసకందాయంలో జనగామ రాజకీయాలు

తెలంగాణలో ఎక్కడా లేని విధంగా జనగామ నియోజకవర్గం రాజకీయాలు రోజుకో మలుపు తిరుగుతున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి స్థానంలో రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డికి అధిష్టానం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందన్న ప్రచారంతో ఆ నియోజకవర్గం రాజకీయాలు రసకందాయంలో పడ్డాయి. వాస్తవానికి ఏడాదిన్నరగా ముత్తిరెడ్డిని మారుస్తారన్న ప్రచారంతోపాటు ఆయన స్థానంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ప్రయత్నాల్లో ఉన్నారన్న చర్చ జరుగుతోంది. జనగామ నియోజకవర్గంలో శ్రీనివాస్‌రెడ్డి తిరగడం కూడా ఇందుకు బలం చేకూరింది. అయితే.. సడన్‌గా 10 రోజుల నుంచి పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేరు ఖరారైనట్లు బలంగా ప్రచారం జరుగుతుండడంతో ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి హైదరాబాద్ నోమా హోటల్‌లో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి బలప్రదర్శన చేశారు. జనగామలో ఆయన వర్గీయులు అయితే ముత్తిరెడ్డికి, లేదంటే పోచంపల్లికి ఇవ్వాలని.. 'పల్లా వద్దే వద్దు' అని నిరసనలకు దిగారు. ఇదే సమయంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో పూజలు చేసి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. దీంతో జనగామ బీఆర్ఎస్ రాజకీయాలు రసకందాయంలో పడగా.. ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి మధ్య టికెట్ పోరు రసవత్తరంగా మారింది.

చల్లారని 'స్టేషన్' మంటలు

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో మాజీ ఉప ముఖ్యమంత్రుల మధ్య మాటల మంటలు చల్లారడం లేదు. ఎమ్మెల్సీ కడియం శ్రీహరికి అధిష్టానం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందన్న ప్రచారంతో సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ టి.రాజయ్య సైతం నియోజకవర్గంలో పర్యటనల దూకుడు పెంచారు. ఓ వైపు శ్రీహరి, మరోవైపు రాజయ్య పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహిస్తుండడం ద్వితీయ శ్రేణి ప్రజాప్రతినిధులు, క్యాడర్ పరిస్థితి మింగలేక.. కక్కలేక అన్నట్లుగా మారింది. ఇదే సమయంలో శ్రీహరి, రాజయ్య ఒకరిపై ఒకరు చేసుకుంటున్న ప్రత్యక్ష, పరోక్ష ఆరోపణలు గతంలోకన్నా ఇప్పుడు తారస్థాయికి చేరడం.. అధిష్టానం వేచి చూసే ధోరణితో ఉండడంతో ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ క్యాడర్‌లో నెలకొంది.

భూపాలపల్లికి పాకిన సెగ..

కాగా.. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్‌లకే పరిమితమైన టికెట్ల పోరు ఇప్పుడు భూపాలపల్లి నియోజకవర్గంలో తీవ్రరూపం దాల్చింది. భూపాలపల్లి నియోజకవర్గం నుంచి శనివారం ఎమ్మెల్సీ మధుసూదనాచారిని కలిసేందుకు వెళ్లిన ఆయన అనుచరులు.. ఆదివారం భూపాలపల్లిలో టవరెక్కి గండ్ర వెంకటరమణారెడ్డికి టికెట్ ఇవ్వొద్దని నిరసన తెలిపారు. ఉద్యమకారుడైన చారికే ఇవ్వాలని ఆయన అనుచరులు భూపాలపల్లితో పాటు శాయంపేట తదితర మండలాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. మరో వైపు గండ్ర వెంకటరమణారెడ్డి అనుచరులు సైతం సిట్టింగ్‌లకే ఇవ్వాలన్న వాయిస్‌ను వినిపించారు. దీంతో తాజా వివాదంపైనా అధిష్టానం ఆరా తీస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

తొలి జాబితా విడుదలపై ప్రచారం..

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సోమవారం (నేడు) తొలి జాబితా విడుదల చేస్తారన్న ప్రచారం జరుగుతోంది. దీంతో ఉమ్మడి వరంగల్‌లో ఎవరి సీట్లు పదిలం.. ఎవరి సీట్లకు ఎసరు వస్తుందోనన్న ఉత్కంఠ పలువురు 'సిట్టింగ్'లలో మొదలైంది. ఇప్పటికే ఈసారి కూడా టికెట్ వారికేనన్న సంకేతాలందిన వారు తమ పనులు చక్కబెట్టుకుంటుండగా.. మార్పు తప్పదన్న సంకేతాలున్న వారు శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నారు. సందిగ్ధంలో ఉన్న 'సిట్టింగ్'లు ఓ వైపు ప్రయత్నాలు చేస్తూ.. మరోవైపు దేవుడిపై భారం వేసి పూజలు, యాగాలు చేస్తున్నారు. పాలకుర్తి, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, పరకాల, నర్సంపేట నియోజకవర్గం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు, దాస్యం వినయ్‌భాస్కర్, అరూరి రమేశ్, చల్లా ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి టికెట్లపై పూర్తిగా భరోసాతో ఉన్నారు. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, వరంగల్ తూర్పులో అధిష్టానం అభ్యర్థులను మార్చాలన్న నిర్ణయం తీసుకుందన్న ప్రచారం ఉంది. తాజాగా భూపాలపల్లిలో టికెట్ వివాదం తెరమీదకు రాగా.. దీంతోపాటు డోర్నకల్, మహబూబాబాద్‌లో కూడా మార్పులు ఉంటాయా? 'సిట్టింగ్'లకే గ్రీన్‌సిగ్నల్ ఇస్తారా? అన్న అంశాలపై అధిష్టానం స్పష్టత ఇస్తేనే ఉత్కంఠ వీడే అవకాశం ఉంది.

బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒక్కటే

- ఎమ్మెల్యేగా గెలిపిస్తే భూకబ్జాలు, అవినీతి ఉండదు
- పార్టీ జిల్లా, మండల, గ్రామ, అనుబంధ కమిటీలు రద్దు
- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ: తెలంగాణలో బీఆర్ఎస్, బీజేపీ రెండు పార్టీల కలయిక ఒక్కటే అని.. బయట మాత్రం తిట్ల పురాణంతో ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో ఈ రెండు పార్టీలను నమ్మవద్దని పిలుపు నిచ్చారు. సీఎం కేసీఆర్ తెలంగాణలో మద్యాన్ని ఏరులై పారిస్తున్నారన్నారు. మద్యానికి బానిసలుగా మారుతున్న చాలా మంది యువకులు మూడు పదులు దాటక ముందే ప్రాణాలు విడుస్తున్నారన్నారు. రాష్ట్రంలో 2014లో మద్యంపై రూ.9వేల కోట్ల ఆదాయం ఉంటే, ఇప్పుడు కేసీఆర్ ప్రభుత్వంలో రూ.40 వేల కోట్లకు పెరిగిందన్నారు. భవిష్యత్‌లో రోజురోజుకు పెరుగుతున్న మద్యం వ్యాపారంతో చెడు తప్ప.. మంచి ఉండదన్నారు. కాంగ్రెస్ హయాంలో భూములను రక్షిస్తే, కేసీఆర్ ఖాళీ చేస్తున్నారన్నారు. భూకబ్జాలు, ప్రభుత్వ భూముల అమ్మడం, మద్యంతో వచ్చే ఆదాయంతోనే పరిపాలన సాగిస్తున్నారన్నారు. కేసీఆర్ సభలు, సమావేశాల్లో ఆయన చెప్పింది వినడం, వెళ్లిపోవడం తప్ప, ఎదురు మాట్లాడే వారు లేరన్నారు. కాంగ్రెస్ హయాంలో ప్రతి పక్ష పార్టీలపై రివేంజ్ తీర్చుకోలేదని, ఇప్పుడు అందుకు విరుద్ధంగా నడుస్తుందన్నారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో జరిగిన అభివృద్ధి తప్ప ఏమీ లేదన్నారు. జిల్లా, మండల, గ్రామ, అనుబంధ సంఘాలను రద్దు చేస్తున్నట్లు, పది రోజుల్లో కొత్త కమిటీలు ఉంటాయన్నారు. జిల్లా వర్కింగ్ అధ్యక్షుడి పోస్టు లేదన్నారు. తన ప్రమాణ స్వీకార మహోత్సవానికి వచ్చిన ప్రతిఒక్కరికి, నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు మోటె శ్రీనివాస్, ఆలేటి సిద్ధి రాములు, జిల్లెల్ల సిద్ధారెడ్డి, మేడ శ్రీనివాస్, లింగాల నర్సిరెడ్డి, బొట్ల నర్సింగరావు, నూకల బాల్‌రెడ్డి, ధర్మగోవర్ధన్ రెడ్డి, జీవన్ రెడ్డి, పిట్టల సతీష్, జమాల్ షరీఫ్, ఆకుల లక్ష్మయ్య, బండారు శ్రీనివాస్, జాయ మల్లేష్, మోర్తాల ప్రభాకర్, రాజిరెడ్డి, దాసరి క్రాంతి, జామ మల్లేశం, సత్యనారాయణ, నారాయణ, కృష్ణ, కడారు ప్రవీణ్, సిద్ధులు, మధు, వెంకటేష్, కమలాకర్, విజయలక్ష్మి, అండాలు ఉన్నారు.

గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటన



జఫర్‌గఢ్: మండలంలోని జఫర్‌గఢ్, తీగారం గ్రామాల్లో కేంద్ర బృందం ప్రతినిధులు ఆదివారం పర్యటించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో చేపట్టిన మరుగుదొడ్లు, ఇంకుడుగుంతలు తదితర అభివృద్ధి పనులను కేంద్ర బృందం ప్రతినిధులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ప్రధానంగా ఇంటింటా మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, తడి చెత్త, పొడి చెత్త తరలింపు, సెగ్రిగేషియన్ షెడ్లు, శ్మశానవాటికలు, పరిసరాల పరిశుభ్రత తదితర పనులను స్వయంగా పరిశీలించడంతో వాటి వినియోగం తదితర వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ వెంకటప్రసాద్, ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, ఎంపీఓ సుధీర్, సర్పంచ్ నర్సింగరావు, జైపాల్‌రెడ్డి, పంచాయితీ కార్యదర్శి రాజేశ్వర్, టీఏ కుమారస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్కంఠ!

- మద్యం కిక్కు తేలేది నేడే
- లాటరీ ద్వారా ఎంపిక
- జిల్లాలో 47 వైన్స్‌లు, 2,492 దరఖాస్తులు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ శివలింగయ్య

జనగామ: మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకున్న వ్యాపారుల్లో ఉత్కంఠ నెలకొంది. మరికొద్ది సేపట్లో మొదలు కానున్న లక్కీ లాటరీలో వ్యాపారుల భవితవ్యం తేలిపోనుంది. 2023–25 సంవత్సరానికి గాను వైన్స్‌లను దక్కించుకునేందుకు ఒక్కొక్కరు ఒకటి నుంచి 50 వరకు దరఖాస్తులు వేయగా, సుమారు ఆరు సిండికేట్ గ్రూపుదారులు 250కి పైగా దరఖాస్తులు వేశారు. జిల్లాలోని 47 మద్యం దుకాణాల కోసం 2,492 దరఖాస్తులు వచ్చాయి. కాగా జనగామ మండలం హైదరాబాద్ రోడ్డు పెంబర్తి బీఎంఆర్ గార్డెన్‌లో నేడు (సోమవారం) ఉదయం 9.30 గంటలకు లాటరీ నిర్వహించనున్నట్లు ఎక్సైజ్‌శాఖ జిల్లా అధికారి కృష్ణప్రియ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ శివలింగయ్య బీఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే లాటరీ ఏర్పాట్లను అధికారులతో కలిసి ఆదివారం సాయంత్రం పరిశీలించారు.

డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి

- కర్ణాటక రాష్ట్ర కుంద్గోల్ ఎమ్మెల్యే ఎంఆర్ పాటిల్



మాట్లాడుతున్న బీజేపీ ఎమ్మెల్యే ఎంఆర్ పాటిల్

స్టేషన్‌ఘన్‌పూర్: కేంద్రం, రాష్ట్రంలో బీజేపీ సర్కార్ వస్తేనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని కర్ణాటక రాష్ట్రం కుంద్గోల్ నియోజకవర్గ ఎమ్మెల్యే ఎంఆర్ పాటిల్ అన్నారు. డివిజన్ కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో భారతీయ జనతాపార్టీ ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. పార్టీ ఘన్‌పూర్ అసెంబ్లీ కన్వీనర్ ఐలోని అంజిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు అధికం అయ్యాయని, ఎన్నికల ముందు చేసిన హామీలను విస్మరిస్తూ పాలకులు ప్రజలను దగా చేస్తున్నారన్నారు. నియోజవకర్గంలో మొత్తం 290 బూత్‌లకు గాను ఇప్పటికే 266 బూత్ ఎన్నికలు జరిగాయని, మిగిలిన బూత్ సమావేశాలు త్వరలో నిర్వహించి బూత్‌స్థాయిలో పార్టీని మరింతగా పటిష్టం చేయాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండె విజయ రామారావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదాసు వెంకటేష్, రాష్ట్ర నాయకులు బొజ్జపల్లి సుభాష్, ఉడుగుల రమేష్, చిలుక విజయరావు, మండల పార్టీ అధ్యక్షుడు గట్టు క్రిష్ణ, గురిజాల వీరన్న, వెంకట్‌రెడ్డి, బూర్ల విష్ణు, రడపాక ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి కల్పించాలి

బీజేవైఎం ఆధ్వర్యంలో రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న బీజేవైఎం, బీజేపీ నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి కల్పించాలని, నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డివిజన్ కేంద్రంలో బీజేవైఎం ఆధ్వర్యంలో ఆదివారం రాస్తారోకో చేపట్టారు. స్థానిక పాత గాంధీ చౌరస్తా నుంచి రైల్వేగేట్ రోడ్డుపై కొత్త గాంధీ చౌక్ వద్ద రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం కేసీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు బొజ్జపల్లి సుభాష్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కొలనుపాక శరత్‌కుమార్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నిరంకుశ, అవినీతి పాలన సాగిస్తున్నారన్నారు. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి తదితర హామీలన్నీ అటకెక్కాయన్నారు. విద్యార్థులు, యువత, నిరుద్యోగ సమస్యలపై సీఎం కేసీఆర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ నిరుద్యోగ యువత జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. తక్షణమే స్పందించి నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని, ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, నిరుద్యోగ భృతి కల్పించాలని డిమాండ్ చేశారు. బీజేవైఎం, బీజేపీ నాయకులు రాస్తారోకో చేస్తున్న విషయం తెలుసుకున్న ఎస్ఐ నాగరాజు పోలీసులచే సంఘటనా స్థలానికి చేరుకుని వారిచే రాస్తారోకో విరమింపచేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం, బీజేపీ నాయకులు దూసరి యాకయ్య, గట్టు క్రిష్ణ, పూంద్రు నవీన్‌రెడ్డి, రడపాక ప్రదీప్ నాయకులు పాల్గొన్నారు.

ఓటుతో అవినీతిపరులకు గుణపాఠం చెప్పాలి

స్టేషన్‌ఘన్‌పూర్: ఓటుతో అవినీతిపరులైన పాలకులకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు వడ్లకొండ పరుశరాములు అన్నారు. డివిజన్‌కేంద్రంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఘన్‌పూర్ నియోజకవర్గం 1978లో ఎస్సీ రిజర్వేషన్ అయిందని, నాలుగున్నర దశాబ్దాలు గడుస్తున్న ఎస్సీల అభివృద్ధిని పట్టించుకున్న పాలకులు లేరన్నారు. నాటి నుంచి నేటి వరకు ఎమ్మెల్యేలుగా పనిచేసిన వారందరూ కేవలం రిజర్వేషన్‌ను వినియోగించుకుని తమ ఆస్తులు కూడబెట్టుకున్నారే తప్ప నియోజకవర్గానికి, ఎస్సీలకు చేసిందేమి లేదన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి ఇద్దరు తెలంగాణ రాష్ట్రానికి డిప్యూటీ సీఎంలుగా పనిచేసినా నియోజకవర్గానికి ఒరగబెట్టిందేమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వడ్లకొండ యాకయ్య, రంగు వెంకన్న, ఐత శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలి

- నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నిట్ డైరెక్టర్

కాజీపేట అర్బన్ : పరిశోధనలకు కేంద్రంగా నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలని వరంగల్ నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ అన్నారు. నిట్ వరంగల్‌లోని అంబేడ్కర్ లెర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో ఆదివారం రీసెర్చ్ అడ్వైజరీ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సును డైరెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్(ఆర్అండ్‌డీ) నిత్య పరిశోధనలతో ప్రపంచ స్థాయిలో నిట్ కీర్తిని చాటుతున్నారని, పరిశోధకులకు అన్ని రకాల సౌకర్యాలు, సదుపాయాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఆర్‌సీఐ హైదరాబాద్, డైరెక్టర్ టాటా నర్సింగరావు, ఐఐటీ గాంధీనగర్ ప్రొఫెసర్లు అమిత్ ప్రశాంత్, రామానుజ్ నారాయణ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు నాగ పంచమి

హన్మకొండ కల్చరల్: వేయి స్తంభాల ఆలయంలో రుద్రేశ్వర స్వామిని ఆదివారం నాగేశ్వరుడిగా అలంకరించి పూజలు జరిపారు. శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా సోమవారం నాగుల పంచమిని పురస్కరించుకుని ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో ఈపూజలు జరిపారు. సోమవారం ఉదయం 5 గంటల నుంచి సుప్రభాత పూజలు, నాగాభరణుడైన శివుడికి మహన్యాసకపూర్వక రుద్రాభిషేకాలు, అన్నపూజ, దేవాలయ ఆవరణలోని నాగశిల పుట్ట వద్ద పుష్పార్చనలు, పసుపు కుంకుమతో అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఉపేంద్ర శర్మ తెలిపారు.

పదివేల గాజులతో అలంకరణ



గాజుల అలంకరణలో ఉప్పలమ్మతల్లి

జనగామ రూరల్: పట్టణంలోని ఉప్పలమ్మ తల్లి సమేత అంజనేయస్వామి దేవాలయంలో శ్రావణ మాసం ఆదివారం పురస్కరించుకొని ఆలయ పూజారి వారణాసి పవన్‌శర్మ అమ్మవారికి పది వేల గాజులతో ప్రత్యేక అలంకరణ చేశారు. మహిళలు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ హరిశ్చంద్ర గుప్త, ఆరుట్ల శోభ అనంతరెడ్డి, అంజనేయులు, దామోదర్, సుగుణ, పెద్ది కుసుమ, నాగరాజు, ఈఓ మధు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మొబైల్ టీబీ పరీక్షలు

- 19 రోజుల పాటు సేవలు
- జనగామలో తగ్గుతున్న కేసులు



ఏసీఎఫ్ వాహనం

జనగామ: రాష్ట్ర వ్యాప్తంగా టీబీ కేసులను తగ్గించడంతో పాటు కమ్యూనిటీగా వ్యాప్తి చెందకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లాలో డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రశాంత్ పర్యవేక్షణలో జిల్లా టీబీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ లగిశెట్టి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి వచ్చే నెల 9వ తేదీ వరకు (సెలవు దినాలు వదులుకుని) 15 రోజుల పాటు స్పెషల్ టీబీ పరీక్షలకు శ్రీకారం చుట్టారు. ఇందుకు సంబంధించి జిల్లాకు నేడు (సోమవారం) యాక్టివ్ కేసు ఫైలింగ్ వ్యాన్ (ఏసీఎఫ్ వెహికిల్) రానుంది. జిల్లాలోని 16 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా మండలం, గ్రామాల్లో ప్రతి ఒక్కరికి టీబీ పరీక్షలు చేయనున్నారు. 2025 నాటికి రాష్ట్రంలో జీరో టీబీ కేసులే లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగుతుంది. వ్యాన్‌లో టీబీ, క్షయ పరీక్షలకు సంబంధించి తెమడ, రక్తం శాంపిల్స్ పరికరాలతో పాటు ఎక్స్‌రే యంత్రం అందుబాటులో ఉంటాయి. జిల్లాలో ఏటా 750 టీబీ పరీక్షలు చేయాలనే టార్గెట్ ఉండగా, గత రెండేళ్ల నుంచి 9 వందల వరకు చేస్తున్నారు. ఐదు నెలలుగా కేవలం 2 నుంచి 3 శాతం మాత్రమే కేసులు నమోదు కాగా, జిల్లాలో టీబీ వ్యాధిగ్రస్తుల సంఖ్య అంతకంతకు తగ్గుముఖం పడుతుంది. మరోసారి టీబీ వ్యాధిగ్రస్తులు ఎవరైన ఉన్నారా? అనే కోణంలో క్రాస్ చెకింగ్ కోసం ఈ స్పెషల్ మొబైల్ వ్యాన్ టెస్ట్‌లను ఏర్పాటు చేస్తున్నారు. రెండు వారాల కంటే ఎక్కువగా దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, రాత్రి పూట చెమటలు రావడం, గతంలో చికిత్స పొందిన టీబీ, హెచ్ఐవీ (రెండు కలుపుకుని), డయాబెటిక్, ఎండీఆర్ టీబీ, హెచ్ఐఎన్ రోగులను సైతం కలిసి మరోసారి స్క్రీనింగ్ చేస్తారు. అన్ని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు.

తేదీల వారీగా టీబీ పరీక్షల షెడ్యూల్

ఈనెల 21న పాలకుర్తి, 22న బచ్చన్నపేట, 23న కోమళ్ల, 24న రఘునాథపల్లి, 26న మల్కాపూర్, 28న స్టేషన్‌ఘన్‌పూర్, 29న దేవరుప్పుల, 30న కొడకండ్ల, సెప్టెంబర్ 1న జఫర్‌గఢ్, కూనూరు, 2న ఓబుల్‌కేశ్వాపూర్, 4న లింగాలఘనపురం, 5న ఇప్పగూడెం, 6న నర్మెట, 8న తాటికొండ, 9న అర్బన్ పీహెచ్‌సీలో టీబీ పరీక్షలు చేయనున్నారు.

షెడ్యూల్ ప్రకారమే..



"జిల్లాలో టీబీ పరీక్షల కోసం నేటి నుంచి మొబైల్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. నేటి నుంచి వచ్చే నెల 9వ తేదీ వరకు టీబీ పరీక్షలు చేస్తాం. వాహనంలో రక్తం, తెమడ శాంపిల్స్, ఎక్స్‌రే అందుబాటులో ఉంటుంది. 16 పీహెచ్‌సీల వారీగా ఎక్కడ మిస్ కాకుండా ఈ పరీక్షలు చేసి, టీబీ రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేస్తాం. రెండేళ్లుగా జిల్లాలో టీబీ కేసులు తగ్గుముఖం పట్టాయి.

-డాక్టర్ అశోక్ కుమార్, టీబీ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్

క్లుప్తంగా

సకల సౌకర్యాలతో 'యూనిసిటీ'

● కుడా' ఛైర్మన్ సుందర్ రాజ్ యాదవ్



మాట్లాడుతున్న సుందర్ రాజ్

ధర్మసాగర్/నయీంనగర్ : సకల సౌకర్యాలతో యూనిసిటీ వెంచర్‌ను అభివృద్ధి చేస్తామని 'కుడా' ఛైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్ అన్నారు. మండలంలోని ఉనికిచర్ల గ్రామంలో 'కుడా' ఆధ్వర్యంలో ఆదివారం యూనిసిటీ ప్లాట్ల వేలం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'కుడా' ఆధ్వర్యంలో యూనిసిటీ ఏర్పాటు చేయడం ముఖ్యఉద్దేశం వినియోగదారులకు అతి తక్కువ ధరలో అత్యున్నత ప్రమాణాలు కలిగిన ప్లాట్లు అందించడమేనన్నారు. 'కుడా'ఏర్పాటు చేసే వెంచర్ల ద్వారా సమకూరిన ఆదాయాన్ని నగర అభివృద్ధికి వినియోగిస్తామన్నారు. నగర అభివృద్ధిలో 'కుడా'ముఖ్య భూమిక పోషిస్తుందన్నారు. ఓఆర్‌ఆర్‌ను ఆనుకుని ఏర్పాటు చేసిన ఈ వెంచర్ వినియోగదారులకు రవాణా, ఉద్యోగ, వ్యాపార పరంగా అనువైన స్థలమని చెప్పారు. యూనిసిటీ వెంచర్‌ను వాస్తు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, అండర్ గ్రౌండ్ ఎలక్ట్రిసిటీ, ఇతర అత్యున్నత వసతులతో ఏర్పాటు చేస్తున్నామని వివరించారు . ఈ సందర్భంగా యూనిసిటీ ఏర్పాటుకు భూములు ఇచ్చిన రైతులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ షేక్ రిజ్వానా బాషా, పీఓ అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావు, సెక్రటరీ మురళీధర్ రావు, జేపీఓలు శంకర్, తదితరులు పాల్గొన్నారు.

డీఈఓ ఇంటిపై దాడికి యత్నం..?

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావు ఇంటిపై ఆ శాఖలో పని చేసిన ఓ ఉద్యోగి దాడికి యత్నించినట్లు తెలిసింది. సదరు ఉద్యోగిని కొన్ని నెలల క్రితం డీఈఓ రామారావు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శాఖాపరమైన అంశంలో సస్పెండ్ చేశారు. ఈ క్రమంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని హైమా గార్డెన్స్‌లో డీఈఓ నివాసం ఉండే ఇంటి వద్దకు వచ్చి సస్పెండ్ అయిన ఉద్యోగి గొడవ చేసినట్లు సమాచారం. డీఈఓ, అతడి కుటుంబ సభ్యులు డయల్ 100కు ఫోన్ చేయగా పోలీసులు వచ్చి దాడికి యత్నించిన ఉద్యోగిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. జరిగిన విషయంపై టౌన్ పోలీస్‌స్టేషన్‌లో డీఈఓ ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ చేస్తున్నారు.

బాలికపై చిత్రహింసల కేసులో ఆరుగురి రిమాండ్

పాలకుర్తి: పాలకుర్తి మండలంలోని చెన్నూరులో చోరీ కేసులో బాలికను చెట్టుకు కట్టేసి కంటిలో కారం చల్లి చిత్రహింసలకు గురిచేసిన కేసులో నిందితులను 14 రోజులు రిమాండ్‌కు తరలిస్తూ జనగామ జిల్లా జడ్జి ఆదివారం తీర్పునిచ్చారు. ఈ కేసులో పూస్కూరి మధుకర్ అతని భార్య సునీత, పూస్కూరి ప్రభాకర్, అతని భార్య రాణి, గునుగంటి వెంకటేశ్వర్లు, సీతయ్యను 14 రోజుల రిమాండ్‌కు తరలించారు. నలుగురు పురుషులను జనగామ జైలుకు, ఇద్దరు మహిళలను నర్సంపేట జైలుకు తరలించారు.



'ఎద'కు ఇదే సమయం..

పశువుల్లో కృత్రిమ గర్భధారణకు అనుకూల కాలం

● ఎదను గుర్తించి పశువైద్యులను సంప్రదించాలి
● అందుబాటులో ఇంజక్షన్, టాబ్లెట్లు
● రైతులు వినియోగించుకోవాలి : పశువైద్యుల సూచన


కృత్రిమ గర్భధారణతో జన్మించిన దూడ (ఫైల్)


మంజీలాల్, పశువైద్యాధికారి చెన్నారావుపేట

చెన్నారావుపేట : ఆగస్టు, సెప్టెంబర్ నెలలు.. పశువులు ఎదకు వచ్చే అనుకూల సమయం. ఈ నెలల్లో రైతు పశువులకు కృత్రిమ గర్భధారణ చేయించాలి. తద్వారా పశువుల్లో సుఖవ్యాధులు నియంత్రణలోకి వస్తాయి. అంతేకాకుండా మేలుజాతి పశు సంపద ఉత్పత్తికి కూడా అవకాశం ఉంటుంది. గేదెలు, ఆవుల విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే పాల దిగుబడి అధికంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో పశువుల కృత్రిమ గర్భధారణ.. తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. ఎదను గుర్తించడం.. ఎదలో ఉన్న పశువుల లక్షణాలు వంటి అంశాలపై చెన్నారావుపేట పశు వైద్యాధికారి మంజీలాల్ (8019470789) 'సాక్షి' వివరించారు.

అనువైన సమయం..

ఆవుల్లో ఎదకు వచ్చిన 12 నుంచి 14 గంటల మధ్య గర్భధారణ చేస్తారు. ఇలా చేస్తే పశువుల్లో ఎదను ఒక్కసారితో నిలపొచ్చు. లేదంటే మళ్లీ 21 రోజుల దాటిన తర్వాత ఎదకు వచ్చే అవకాశం ఉంటుంది. అందుకే కృత్రిమ గర్భధారణే చేయించాలి. ఆంబోతులు, దున్నలతో గర్భధారణ చేయిస్తే వాటి రోగాలు పశువులకు వచ్చే అవకాశం ఉంది.

ఎదను గుర్తించడం..

ఆవులు ఏడాది పొడవునా ఎదకు వస్తాయి. గేదెలు ఆగస్టు నుంచి మార్చి వరకు ఎక్కువగా వస్తాయి. సంకరజాతి ఆవులు, ముర్రా జాతి గేదెలు, దేశవాళీ ఆవులు, గేదెలు 20 నుంచి 25 రోజులకు ఎదకు వస్తాయి. యుక్త వయసుకు వచ్చిన పశువు అండాశయంలో ఉత్పత్తి అయిన హార్మోన్ల ప్రభావం (తీగెలు కారడం) వల్ల ఎద లక్షణాలను వ్యక్తం చేస్తుంది. పశువులను జాగ్రత్తగా గమనిస్తే ఎద లక్షణాలను సులువుగా గుర్తించొచ్చు. ఆవుల్లో ఎదకాలం 18 నుంచి 24 గంటలు ఉంటుంది. గేదెకు 24 నుంచి 36 గంటలు పాటు ఉంటుంది. ఎద కాలాన్ని మూడు రకాలుగా విభవించొచ్చు. మొదటి ఆరంభ దశ ఆరుగంటలు, మధ్య దశ 7 నుంచి 16 గంటలు, చివరి దశ 17 నుంచి 24 గంటలు, మూడో దశలో అండం విడుదలై వీర్యకణాలతో కలిసి ఫలదీకరణ చెందుతుంది.

ఎదలో ఉన్న పశువు లక్షణాలు

ఎద తొలి దశలో పశువు మంద నుంచి వేరుపడి చికాకుగా ఉంటుంది. మధ్య దశలో ఇతర పశువులతో కలిసి ఉంటుంది. రంకలేస్తుంటుంది. ప్రవర్తనలో మార్పు ఉండదు. అరుస్తుంది. కచ్చ ఉబ్బి ఉంటుంది. ఆకలి మందగిస్తుంది. మేయకుండా తిరగడానికే ప్రాధాన్యం ఇస్తుంది. పాల దిగుబడి కూడా తగ్గిస్తుంది. ఇతర పశువులను నాకుతుంది. ఇలాంటి పశువులను రైతులు వెంటనే గుర్తించి కృత్రిమ గర్భధారణ చేయించాలి. కొన్ని పశువుల్లో మూగ ఎదలు ఉంటాయి. ఎక్కువగా గేదెల్లో ఇవి కనిపిస్తుంటాయి. వీటిని రైతులు గమనించి వైద్యుల సలహాలు తీసుకోవాలి.

అందుబాటులో కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు

పశువైద్యశాలలో కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయి. ఎదకు వచ్చిన ఆవులు, గేదెలను పశు వైద్యశాలలకు తీసుకెళ్లి ఇంజక్షన్లు చేయించాలి. పశువులు ప్రసవించిన రెండు నెలలకే ఎదకు వస్తుంటాయి. అలాంటప్పుడే ఎద ఇంజక్షన్లు వేయించుకుంటే మేలు ఉంటుంది. ఎదకు రావడానికి ఇంజక్షన్‌తో పాటు టాబ్లెట్‌లు కూడా ఉన్నాయి. ప్రసవం తర్వాత రెండో సారి ఎదకు వచ్చినప్పుడు మాత్రమే కృత్రిమ గర్భధారణ చేయించుకుంటే ఏడాదికి మరో దూడకు జన్మనిస్తుంది. ఇలా చేయడం ద్వారా పాల దిగుబడికి ఎలాంటి ఇబ్బంది ఉండదు.

ఇద్దరిని మింగిన మలుపు..

● అదుపు తప్పిన బైక్.. స్తంభానికి ఢీ
● అక్కడికక్కడే ఒకరు .. చికిత్స పొందుతూ మరొకరు మృతి
● జయగిరి, మునిపల్లి మధ్యలో ఘటన
● రోడ్డున పడిన కుటుంబాలు


కుమారస్వామి మృతదేహం


సందీప్ (ఫైల్)

హసన్‌పర్తి : అవి రెక్కాడితే కాని డొక్కాడని కుటుంబాలు. వారే ఇంటికి పెద్ద దిక్కు. వారు పని చేస్తేనే పూడగడిచేది. లేనిపక్షంలో కుటుంబం మొత్తం పస్తులే. ఇలాంటి వారిని మృత్యువు మింగేసింది. మలుపు వద్ద మాటేసి ఇద్దరిని అమాంతం బలిగొంది. దీంతో ఆయా కుటుంబాలు పెద్ద దిక్కులను కోల్పోయి రోడ్డున పడ్డాయి. వివరాల్లోకి వెళ్తే.. హసన్‌పర్తి మండలం జయగిరి, మునిపల్లి మధ్యలో బైక్ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందారు. సీఐ గోపీ కథనం ప్రకారం హసన్‌పర్తి మండలం జయగిరికి చెందిన శీలం సందీప్(20), స్థానికంగా లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. మునిపల్లికి చెందిన కొంకటి కుమారస్వామి(35) తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం సందీప్ జయగిరి నుంచి మునిపల్లికి బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో మునిపల్లికి చెందిన కుమారస్వామి లిఫ్ట్ అడిగాడు. అయితే బైక్.. జయగిరి నుంచి కొద్ది దూరం వెళ్లగానే మలుపు వద్ద ఎదురుగా ఉన్న స్తంభాన్ని ఢీకొంది. ఈ ఘటనలో కుమారస్వామి, సందీప్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కుమారస్వామి అక్కడే మృతి చెందగా, సందీప్‌ను 108లో ఎంజీఎం తరలించారు. చికిత్స పొందుతూ సందీప్ మృతి చెందాడు. మృతదేహాలను ఎంజీఎం మార్చురీలో భద్రపరిచినట్లు సీఐ చెప్పారు.

బతుకుదెరువు కోసం వచ్చి..

మృతుడిల్లో కొంకటి కుమారస్వామి స్వస్థలం కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం బొమ్మకల్. కుమారస్వామికి భార్య, కుమారుడు, కూతుళ్లు ఉన్నారు. మూడేళ్ల క్రితం బతుకుదెరువు నిమిత్తం కుమారస్వామి మునిపల్లికి వచ్చాడు. ఇక్కడే తాపీ మేస్త్రీ పనిచేస్తూ కుటుంబాన్నిపోషిస్తున్నాడు. ఆదివారం పనికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో విద్యుత్ స్తంభం రూపంలో మృత్యువు కబలించింది. కుమారస్వామి మృతితో ఆ కుటుంబం రోడ్డున పడింది.

సాకే వాడే పోయాడు...

సందీప్ మృతితో ఆ కుటుంబం రోడ్డున పడింది.గతంలోనే సందీప్ తండ్రి మృతి చెందాడు. తల్లి, చెల్లెలు అనారోగ్యంతో బాధపడుతున్నారు. కుటుంబ పరిస్థితుల కారణంగా సందీప్ మధ్యలోనే చదువు మానేవేశాడు. కుటుంబ పోషణ నిమిత్తం క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. సందీప్ మృతితో ఆ గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

కనిపెట్టకుంటే కష్టమే!

● పంటల దిగుబడి తగ్గించే వయ్యారిభామ
● మనుషులు, పశువుల ఆరోగ్యంపై దుష్ప్రభావం
● మొక్కలను నివారించాలని శాస్త్రవేత్తల సూచన


వయ్యారిభామ కలుపుమొక్క

కరీమాబాద్: వయ్యారిభామ.. పేరు వినడానికి బాగున్నా ఇది ఎన్నో దుష్ప్రభావాలకు కారణమయ్యే కలుపుమొక్క. అన్ని రకాల కలుపుమొక్కలు ఒకెత్తయితే.. ఇది మరో ఎత్తు. దీని మూలంగా ఒక్క పంటల దిగుబడి తగ్గడమే కాదు.. మనుషులు, పశువుల ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం కలుగుతుంది.

మొక్కను ఇలా గుర్తించాలి..

ఈ మొక్క చాలా సులువుగా పెరిగి పంట పొలాలను నాశనం చేస్తుంది. సుమారు రెండు మీటర్ల ఎత్తు పెరిగి ఆకులు చీలికలతో కూడి వాటిపై రోమాల వంటి సన్నని నూగుతో అనేక శాఖలుగా విస్తరించి ఉంటుంది. దీని విత్తనాలు గాలి ద్వారా సుమారు 3 కిలోమీటర్ల వరకు వ్యాపిస్తాయి.

పంటల్లో కలిగే నష్టాలు..

ఈ మొక్క స్రవించే రసాయనాలతో పంట దిగుబడి తగ్గిపోతుంది. మొక్క పూలపై ఉండే పుప్పొడి టమాట, వంకాయ, మిరప వంటి మొక్కలపై పడితే పూలు, పిందెలు రాలిపోతాయి. పంటలకు వచ్చే అనేక రకాల చీడపీడలు, తెగళ్లకు ముఖ్యంగా తామర పురుగులకు ఈ మొక్క నివాసంగా ఉంటుంది.

మనుషులకు కలిగే నష్టాలు..

వయ్యారిభామ మనుషుల్లో కూడా తీవ్ర అనారోగ్య సమస్యలకు కారణమవుతుంది. డెర్మటైటిస్, ఎగ్జిమా, హైఫీవర్, ఉబ్బసం, బ్రాంకైటిస్ వ్యాధులు వస్తాయి. ఈ ఆకులు చర్మానికి రాసుకుంటే తామర వస్తుంది. పుప్పొడిని పీలిస్తే జలుబు, కళ్లు ఎర్రబడడం, కను రెప్పలు వాపులు వస్తాయి. వెంట్రుకలు రాలిపోతాయి.

పశువులపై ప్రభావం..

ఈ మొక్కను సాధారణంగా పశువులు తినవు. ఒకవేళ పొరపాటున గడ్డితోపాటు తింటే ఆ పశువుల పాలు తాగిన వారికి జ్ఞాపకశక్తి దెబ్బతింటుంది. అలాగే, జీర్ణక్రియ, కిడ్నీ, లివర్, అన్నవాహిక, శ్వాసక్రియలు దెబ్బతిని పశువులు మృత్యువాత పడతాయి.

నివారించకుంటే కష్టం..



"వయ్యారిభామ మొక్క నివారణ చర్యలు చేపట్టాలి. పూత రాకముందే బురదలో కలియదున్నాలి. పంటల సాగును బట్టి గ్లైఫోసిట్, మెట్రిబుజిన్, అలాక్లోర్ లాంటి మందులు వాడడం ద్వారా నియంత్రణలోకి వస్తుంది.

ఆగుర్ల రాజు,
కేవీకే శాస్త్రవేత్త, మామునూరు

వినాయక విగ్రహం లభ్యం

● గుర్తించిన మత్స్యకారులు
● స్థానికుల పూజలు


బయటపడిన వినాయక విగ్రహం


పూజలు చేస్తున్న భక్తులు

హసన్‌పర్తి: 56వ డివిజన్ సప్తగిరి కాలనీలో ఆదివారం వినాయక విగ్రహం బయటపడింది. కాలనీ సమీపంలోని కాల్వ వద్ద మత్స్యకారులు వానపాములు పట్టుకునే క్రమంలో అక్కడ విగ్రహం ఉన్నట్లు గుర్తించి బయటకు తీశారు. విషయం దతెలుసుకున్న సప్తగిరికాలనీ, పరిమళ కాలనీ, టీఎన్జీఓస్, జవహర్ కాలనీ, సురేంద్రపురి కాలనీ, ఎస్‌వీఎస్ హోమ్స్‌తో పాటు చుట్టు పక్కల కాలనీల వాసులు అక్కడికి చేరుకున్నారు. ఆవిగ్రహం కాకతీయుల కాలం నాటిదిగా స్థానికులు పేర్కొంటున్నారు. వినాయక విగ్రహాన్ని కాల్వ వద్దే ప్రతిష్ఠించి పూజలు జరిపారు.

తండ్రిని కడతేర్చిన కసాయి కొడుకు

● దూదేకులపల్లిలో ఘటన


తిరుపతి (ఫైల్)

భూపాలపల్లి రూరల్: కన్నతండ్రిని దారుణంగా కొట్టి చంపిన కసాయి కొడుకు ఉదంతం భూపాలపల్లి మండలం దూదేకులపల్లిలో ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. దూదేకులపల్లికి చెందిన గుమ్మడి తిరుపతి(50), భార్య రాజమణి దంపతులకు ఒకే కొడుకు ధనుంజయ(17) ఉన్నాడు. ఏడాది క్రితం రాజమణి అనారోగ్యంతో మృతి చెందగా తండ్రీ కొడుకులు గ్రామంలోనే ఉంటున్నారు. తొమ్మిదో తరగతి చదివిన ధనుంజయ ఆ తర్వాత స్కూల్‌కు వెళ్లడం మానేశాడు. డబ్బుల కోసం తండ్రితో తరచూ గొడవపడుతూ ఉండేవాడు. ఈనెల 16న తండ్రిని కర్రతో కొట్టి చంపిన ధనుంజయ మృతదేహాన్ని ఇంట్లోనే ఉంచి 17వ తేదీ ఉదయం నుంచి తండ్రి కనబడటం లదని బంధులవులకు ఫోన్‌లు చేస్తూ వెతుకుతున్నట్లు నటించాడు. ఇంట్లో నుంచి దుర్వాసన రావంతో శనివారం రాత్రి మృతదేహాన్ని చద్దర్లలో మూటకట్టి స్కూటీ మీద తీసుకెళ్లి గ్రామ సమీపాన ఉన్న చెరువులో పడవేశాడు. ఆదివారం ఉదయం గ్రామస్తులు మృతదేహన్ని చూసి పోలీసులకు సమాచారం ఇవ్వగా భూపాలపల్లి డీఎస్పీ రాములు, సీఐ రాంనర్సింహారెడ్డి అక్కడికి చేరుకుని ధనుంజయను ఆదుపులోకి తీసుకున్నారు. మృతుడి సోదరుడు కోటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆర్యవైశ్య మిత్ర బృందం కార్యవర్గ ప్రమాణ స్వీకరణ


ప్రమాణ స్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

వరంగల్ చౌరస్తా: ఆర్యవైశ్య మిత్ర బృందం ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం వరంగల్ స్టేషన్ రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దుబ్బా శ్రీనివాస్, కార్యదర్శి నాగేంద్ర బాబు, కోశాధికారి దొడ్డ మోహన్‌రావు ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, ఏవీఓపీఏ ఉమ్మడి రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పోకల చందర్ హాజరయ్యారు. ప్రమాణాస్వీకారం చేసిన వారిలో కల్పన నవీన్, దాచేపల్లి సీతారం, రవ్వా గీత, తోట సంపత్‌కుమార్, పోలా నటరాజ్, జొన్న రాజేశ్వర్‌రావు, బూరెల్లి సత్యనారాయణ, గందె శ్రీనివాస్ ఉన్నారు. కార్యక్రమంలో బజ్జూరి పూర్ణచందర్, భూపతి ప్రవీణ్, ఐతే ప్రసాద్, తాటికొండ కృష్ణమూర్తి, అల్లాడి వీరభద్రయ్య, గార్లపాటి సంతోష్‌బాబు, అనంతల వీరేందర్, తదితరులు పాల్గొన్నారు.

చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి


ఉప్పలయ్య(ఫైల్)

కురవి: తాటి చెట్టుపై నుంచి పడి ఓ గీత కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం మహబూబాబాద్ జిల్లా కురవి మండలం రాజోలు గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన బట్టు ఉప్పలయ్య(39) రోజు వారీగా కల్లు గీసేందుకు తాటి వనంలోకి వెళ్లాడు. తాటి చెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో జారీపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలియగానే కుటుంబీకులు ఘటనా స్థలికి చేరుకుని బోరున విలపించారు. మృతుడికి భార్య స్వాతి, కుమారుడు అభినయ్, కుమార్తె అక్షయ ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై గోపి తెలిపారు.

జ్వరంతో చిన్నారి..

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం రంగయ్యపల్లి గ్రామానికి చెందిన విజయ్, అనిత దంపతుల కూతురు రోహిత(4)కు నాలుగు రోజుల క్రితం జ్వరం వచ్చింది. దీంతో చికిత్స నిమిత్తం హన్మకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబంతోపాటు గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. కాగా, వర్షాకాలం సందర్భంగా గ్రామాల్లో దోమల నివారణ చర్యలు చేపట్టాలని, మురుగు కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రంచేయడంతో పాటు బ్లీచింగ్ పౌడర్ చల్లాలని పలువురు గ్రామస్తులు కోరారు.

ట్రాక్టర్ బోల్తా.. వ్యక్తి ..

మడికొండ : ట్రాక్టర్ బోల్తా పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం మండలంలోని టేకులగూడెం గ్రామంలో జరిగింది. హసన్‌పర్తి మండలం సుబ్బయ్యపల్లికి చెందిన సుంచు రవి(45) తాళ్లపద్మావతి కళాశాల సమీపంలో నగరబోయిన సందీప్ పొలం దున్నుతున్నాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో రవి అక్కడిక్కడే మృతి చెందాడు. ఈఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మడికొండ ఎస్సై రాజబాబు తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి ..

కాజీపేట రూరల్ : పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం రాత్రి కోమటిపల్లి, హసన్‌పర్తి రైల్వేస్టేషన్ల మధ్య జరిగింది. కాజీపేట జీఆర్‌పీ ఎస్సై సీహెచ్ పరుశురామ్ కథనం ప్రకారం కోమటిపల్లి, హసన్‌పర్తి మధ్య కిలో మీటర్ నంబర్ 357 /31-27 వద్ద పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడు సుమారు 30 ఏళ్ల వయసు, చామన ఛాయ రంగు, తలపై నలుపు వెంట్రుకలు, నీలి రంగు టీషర్ట్, సిమెంట్ రంగు నిక్కర్ ధరించాడు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఎంజీఎం తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు కాజీపేట జీఆర్‌పీ పోలీస్‌స్టేషన్ 9490619031 నంబర్లలో సంప్రదించాలని ఎస్సై పేర్కొన్నారు.

వీధి కుక్కల స్వైర విహారం..

● పలువురిపై దాడి.. తీవ్రగాయాలు
● ఆస్పత్రిలో చేరిక

వీధి కుక్కల స్వైర విహారం చేస్తున్నాయి. కనిపించి వారినల్లా కసితీరా కాటు వేస్తున్నాయి. ఫలితంగా ప్రజలు బయటకు రావాలంటేనే భయాందోళనకు గురవుతున్నారు. ఆదివారం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పలువురు వీధి కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేరారు.


కుక్కల దాడిలో తీవ్ర గాయాలపాలైన మహిళ

దేవరుప్పుల: మండల కేంద్రంలో కుక్కల స్వైర విహారం చేస్తున్నాయి. రెండు రోజుల నుంచి కనిపించిన వారిని కాటేస్తున్నాయి. దీంతో బాధితులకు తీవ్రగాయాలయ్యాయి. శనివారం రాత్రి పీహెచ్‌సీ ఎస్సీకాలనీలో చింత నర్సమ్మపై దాడికి పాల్పడడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మండల కేంద్రానికి చెందిన ఉప్పుల రేణుకయాదవ్, యాదమ్మ, ఉదయశ్రీ తదితరులు కుక్కల దాడిలో తీవ్రగాయాలపాలయ్యారు.

మరిగడలో బాలుడిపై..

జనగామ రూరల్ : కుక్కల దాడిలో ఓ బాలుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం మండలంలోని మరిగడి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన దండు శీను, స్వప్న దంపతుల కుమారుడు విన్ను బయటకు వెళ్లి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో కుక్కలు ఒక్క సారిగా దాడి చేయడంతో విన్నుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. కాగా, గ్రామంలో కుక్కలు గుంపులుగా సంచరిస్తూ కనబడిన వారిపై దాడి చేస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వెంటనే కుక్కల బెడదను నివారించాలని వారు కోరుతున్నారు.


బాలుడి చేతిపై కుక్కగాట్లు

కంతాత్మకూరులో గొర్రెలు మృత్యువాత


కుక్కల దాడిలో మృత్యువాత పడిన గొర్రె

నడికూడ : కుక్కల దాడిల 13 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన మండలంలోని కంతాత్మకూర్‌లో జరిగింది. బాధితుడు కొంగంటి లక్ష్మయ్య కథనం ప్రకారం శనివారం రాత్రి గొర్రెల మందను పాకలో నిలిపారు. ఈ క్రమంలో అర్ధరాత్రి సమయంలో కుక్కలు గొర్రెల మందపై దాడికి పాల్పడ్డాయి. ఈ దాడిలో 13 గొర్రెలు మృత్యువాత పడగా మరో నాలుగు తీవ్రంగా గాయపడ్డాయి. మృత్యువాత పడి గొర్రెల విలువ రూ.1.20 లక్షలు వరకు ఉంటుందని బాధితుడు వాపోయారు.ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.